## మా కష్టాలు రేవంత్‌కు తెలుసా..



లక్షెట్టిపేట, జూలై 20 : కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉన్నపుడు రైతులు పడ్డ కష్టాలు రేవంత్‌కు అసలు తెలుసా? అప్పుడు ఆయన ఏ పార్టీలో ఉన్నడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పడ్డ కష్టాలు గుర్తు చేసుకుంటే దుఃఖమస్తది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక సీఎం కేసీఆర్ రైతుల సాగు కోసం ఎంత కరెంటు అవసరం అయితదో అంత కరెంటు పక్క ఇస్తుండు. కాంగ్రెస్ పాలనలో బావులు, పొలం గట్ల కాడ పడిగాపులు కాసిన రోజులు ఎన్నటికీ మరువం. మా కష్టాలు తెలిసిన కేసీఆర్ మాకు 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వడంతోపాటు మూడు పంటలకు కావాల్సిన నీరు అందించడంతో రైతులమంతా సంతోషంగా ఉన్నాం. గతంలో రైతులకు కనీసం పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాక పోవడంతో ఆత్మహత్యలు చేసుకున్నరు. ఇప్పుడు కేసీఆర్ సార్ వచ్చినంక రైతులందరం సంతోషంగా ఉన్నాం.

*- ఎంబడి రాజన్న, రైతు, లక్షెట్టిపేట.*

## ఎకరం కూడా సాగు చేయలేం..



లక్షెట్టిపేట, జూలై 20 : రేవంతు చెప్పినట్లు మూడు గంటలు కరెంటు ఇస్తే కనీసం ఎకరం మడి కూడా తడవదు. కేసీఆర్ ఇచ్చే 24 గంటల ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ నాయకుల కండ్లు ఓర్వలేక లేక మాటలు మాట్లాడుతున్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం మన కేసీఆర్ 24 గంటల కరెంటు ఇవ్వడంతోనే దిగుబడి బాగా వస్తున్నది. ఎప్పుడు కావాలంటే అప్పుడు మోటరు పెట్టుకోవడానికి పోతున్నం. రైతులందరం ఏకమై మూడు గంటల కరెంటు చాలన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మట్టిలో కలిపేస్తం.

*- పడాల కాంతయ్య, రైతు, లక్షెట్టిపేట.*

## పాతరోజులు మాకొద్దు..



ముథోల్, జూలై 20 : రేవంత్ రెడ్డి అన్న మాటలతో గత కాంగ్రెస్ పాలనలో పడిన కరెంటు కష్టాలు గుర్తుకొస్తున్నాయి. అప్పుడు కరెంటు సరిగ్గా రాక చాలా ఇబ్బంది పడ్డాం. లో వోల్టేజీతో మోటర్లు కాలిపోయి బాగు చేయడానికి అప్పులు చేశాం. అప్పటి కష్టాలు చెప్పినా తీర్చేవారు లేరు. అప్పటి రోజులు మాకొద్దు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తొమ్మిదేళ్ల నుంచి వ్యవసాయానికి నిరంతరంగా కరెంటు ఇస్తున్నారు. మాకు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలి.

*- శంకర్, విఠోలి, రైతు(ముథోల్ మండలం)*

## రైతుల జోలికొస్తే ఊరుకోం..



ముథోల్, జూలై 20 : వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఉంటేనే రెండు పంటలు వేసుకుంటున్నాం. మూడు గంటల కరెంటుకు మడి కూడా తడవదు. మూడు గంటల కరెంటుతో ఎవరికి ఉపయోగం ఉండదు. పైసలు ఉన్నోళ్లకు రైతుల బాధలు ఏం తెలుస్తాయి. రైతుల జోలికొస్తే ఊరుకునేది లేదు.

*- పండరి, గన్నోర్రా, రైతు(ముథోల్ మండలం)*

## మూడు గంటలు ఎట్ల సాల్తది



ముథోల్, జూలై 20 : కాంగ్రెస్ హయాంలో కరెంటు ఎప్పుడు ఉండేదో, ఎప్పుడు పోయేదో తెలియకుండే. దీంతో తిప్పలు పడ్డాం. మోటరు పెట్టేందుకు రాత్రుల్లో పోయేవాళ్లం. కానీ.. తెలంగాణ ప్రభుత్వంలో ఆ బాధలు లేవు. 24 గంటల కరెంటుతో రెండు పంటలు తీసుకుంటున్నాం. రాత్రుల్లో పొలానికి పోయే తిప్పలు తప్పాయి. ప్రభుత్వం చేస్తున్న పనులను ఓర్వలేకే ఇలాంటి పనులు చేస్తున్నారు. రైతుల జోలికి వస్తే ఊరుకోం.

*- ఉమ్మడి గణేశ్, విఠోలితాండ, రైతు(ముథోల్ మండలం)*




సారంగాపూర్ : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



పెంబి లో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్



ముథోల్‌లో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి




భీంపూర్ : నిపానిలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్

# కన్నీళ్లు పెట్టించే కాంగ్రెస్సా..
# రైతు క్షేమం కోరే బీఆర్ఎస్సా..




## రైతన్నలు ఏ సర్కారు కావాల్నో ఆలోచించండి

- 60 ఏండ్లలో హస్తం చేసిందేమీ లేదు
- పల్లెల్లోకి వచ్చే ఆ పార్టీ నేతలను తరిమికొట్టాలి
- దమ్ముంటే 'మూడు గంటల కరెంట్' మేనిఫెస్టోతో ఎన్నికలకు రావాలి
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి రాజకీయ సన్యాసం తప్పదు
- రైతు చర్చా వేదికల్లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు
- 24 గంటల ఉచిత విద్యుత్‌పై ఏకగ్రీవ తీర్మానాలు

సారంగాపూర్, జూలై 20 : మూడు గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ కావాలో.. మూడు పంటలకు భరోసానిస్తున్న బీఆర్ఎస్ సర్కారు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో కరెంట్‌పై కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు గంటల కరెంట్ ఇస్తే రైతులకు కన్నీళ్లు తప్పవని, 24 గంటల కరెంట్ ఇస్తేనే రైతులు సమృద్ధిగా పంటలు పండించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే చాలని మాట్లాడడం సరికాదన్నారు. ఎవుసం విలువ తెలియని రేవంత్‌రెడ్డి కల్లుతాగిన కోతిలా కుప్పిగంతులు వేస్తున్నాడని విమర్శించారు. మన ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి 24 గంటల కరెంట్‌తోపాటు లక్షలాది ఎకరాలకు సాగు నీరందిస్తుంటే కాంగ్రెస్ నాయకులకు మింగుడుపడడం లేదని మండిపడ్డారు. వ్యవసాయం దండుగా అన్న చంద్రబాబు నాయుడుకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పుడు కాంగ్రెస్‌ను కూడా బంగాళాఖాతంలో విసిరేసే రోజులు దగ్గర పడ్డాయన్నారు. మాయమాటలు చెప్పి మోసం చేసే కాంగ్రెస్ పార్టీని నమ్మవద్దని, గ్రామాల్లోకి వస్తే తరమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం 24 గంటల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని, మూడు గంటలు వద్దు.. మూడు పంటలు కావాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

దండేపల్లి, జూలై 20 : దండేపల్లి మండలం గూడెం రైతు వేదికలో రైతులతో నిర్వహించిన చర్చా వేదికలో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలంటున్న కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీని నమ్మితే మళ్లీ పాత రోజులే వస్తాయని గుర్తు చేశారు. మూడు గంటల కరెంటు ఇస్తామన్నా కాంగ్రెస్‌ను నమ్ముదామా..? మూడు పంటలకు భరోసానిస్తున్న సీఎం కేసీఆర్‌ను నమ్ముదామా..? ఓసారి ఆలోచన చేయాలన్నారు.

లక్షెట్టిపేట, జూలై 20 : లక్షెట్టిపేట పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన చర్చా వేదికలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై రైతులతో కలిసి పలు తీర్మానాలు చేశారు. తెలంగాణ రైతులు ప్రగతి




జైనథ్ : నిరాలలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

పథంలో దూసుకెళ్తుంటే ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే దివాకర్‌రావు మండిపడ్డారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు పడ్డ కష్టాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ ఉన్నంత కాలం రైతులు రారాజుల్లా బతుకుతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం రేవంత్.. కాంగ్రెస్ పార్టీ డౌన్ డౌన్ అంటూ రైతులు నినాదాలు చేశారు.

హాజీపూర్, జూలై 20 : గుడిపేట గ్రామ పంచాయతీ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు పాల్గొన్నారు. రైతు సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంటు, ఎరువులు, విత్తనాల కోసం అరిగోస పడ్డారని గుర్తు చేశారు. రైతులకు 24 గంటల కరెంటు ఇస్తే ఓర్వలేని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంటే చాలంటున్నాడని, వ్యవసాయం గురించి తెలువనోడు గట్లనే మాట్లాడుతాడని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించి, బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

ముథోల్, జూలై, 20 : మండలంలోని విఠోలి, బ్రహ్మణ్‌గాం రైతువేదికల్లో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొని, కరెంట్‌పై కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై రైతులతో చర్చించారు. రైతులు ఆత్మగౌరవంతో బతుకుతుంటే రేవంత్ రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సిగ్గు చేటని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు కాంగ్రెస్ పాలనలో రైతుల ఎన్ని కష్టాలు పడ్డారో ప్రజలకు వివరించారు. 24 గంటల కరెంట్ కావాలని రైతులు మూకుమ్మడిగా మద్దతు తెలపడంతోపాటు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

భీంపూర్, జూలై 20 : మండలంలోని నిపాని రైతు వేదికలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ వ్యవసాయాభివృద్ధిపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న రాష్ట్రాల ఏర్పాటుతో అనేక ప్రయోజనాలున్నాయని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనాడే చెప్పారని, ఆ విధంగానే సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. రైతులతో పెట్టుకుంటున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్ ఉండదని, రాజకీయ సన్యాసం తప్పదని హెచ్చరించారు.

కడెం, జూలై 20 : మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల కుట్రలను రైతులంతా తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే మూడు గంటల కరెంట్ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.

పెంబి, జూలై 20 : మూడు గంటల కాంగ్రెస్ కావాలా? మోటర్లకు మీటర్లు పెట్టే బీజేపీ కావాలా? మూడు పంటల బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న మన ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు.

జైనథ్, జూలై 20 : మండలంలోని నిరాల, పెండల్‌వాడ రైతు వేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని కాంగ్రెస్ కరెంట్ కుట్రలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతన్నను రాజు చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతాంగానికి బేషరతుగా క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తిర్యాణి, జూలై 20 : వ్యవసాయానికి మూడు గంటలు కరెంట్ చాలన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు డిమాండ్ చేశారు. తిర్యాణి, గిన్నేధరి రైతు వేదికల్లో నిర్వహించిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మార్చితే.. ఓర్వలేని కాంగ్రెస్ వ్యాపార ధోరణి అవలంబిస్తున్నదని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.



లక్షెట్టిపేట : కాంగ్రెస్ పార్టీ మొండి వైఖరిపై నినాదాలు చేస్తున్న రైతులు




దండేపల్లి : గూడెంలో మాట్లాడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



తిర్యాణి : రైతు వేదికలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

# కుల వృత్తులకు కేసీఆర్ అండ

- లక్ష సాయం చారిత్రాత్మక నిర్ణయం
- నియోజకవర్గంలో 300 మందికి అందిస్తాం
- అత్యంత పారదర్శకంగా కార్యక్రమం
- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- నిర్మల్‌లో రూ.లక్ష సాయం పంపిణీ ప్రారంభం
- 46 మంది లబ్ధిదారులకు చెక్కులు..

నిర్మల్, జూలై 20(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల పట్టింపులేని తనంతో కులవృత్తులు కనుమరుగయ్యాయని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టం చేశారు. తాజాగా బీసీల్లోని కులవృత్తులను నమ్ముకొని బతుకుతున్న వారికి రూ.లక్షల ఆర్థికసాయం అందించాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం కులవృత్తులకు రూ.లక్ష పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 46 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా కూడా బీసీల కోసం ఇలాంటి పథకం లేదన్నారు. నియోజకవర్గంలో 300 మందికి ఈ ఆర్థిక సాయాన్ని అందజేస్తామని ప్రకటించారు. ప్రతి వెనుకబడిన కుటుంబానికి పూర్తి పారదర్శకంగా అందిస్తామని చెప్పారు. ఈ మొత్తాన్ని కులవృత్తులకు అవసరమైన ముడి సామగ్రి కొనుగోలుకు వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో మొత్తం 11,759 మంది అర్హులుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారని వెల్లడించారు. వీరందరికీ విడుతలవారీగా ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే త్వరలోనే మళ్లీ దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అనేక వృత్తుల్లో కార్పొరేట్ సంస్థలు ప్రవేశించగా, తెలంగాణలో కులవృత్తులు అంతరించిపోయే దుస్థితికి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వాలు కూడా ఆదుకోకపోవడంతో వృత్తి పనులు నడువక, ఆదాయం రాక అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ పోషణ భారమై అనేక మంది వృత్తులను వదులుకొని వలస వెళ్లారని గుర్తు చేశారు. ఈ పరిస్థితిని గమనించిన సీఎం కేసీఆర్ స్వరాష్ట్రంలో కులవృత్తులకు పునర్జీవం పోసేందుకు నడుంబిగించారన్నారు. కూలీలుగా జీవనం సాగిస్తున్న అనేక మంది వృత్తిదారులను ఓనర్లుగా మార్చేందుకే రూ.లక్ష ఆర్థిక సాయం అందించే పథకానికి శ్రీకారం చుట్టారని స్పష్టం చేశారు. తెలంగాణ సాకారమైన తర్వాత రజక, నాయీబ్రాహ్మణ కులవృత్తులను ప్రోత్సహించే క్రమంలో ఇప్పటికే ఉచిత విద్యుత్ పథకం ప్రారంభించి, నెలకు 250 యూనిట్లు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం స్ఫూర్తితోనే బీసీ కులాల్లో కులవృత్తులు చేసుకుంటున్న వారందరికీ సాయమందించాలనే ఆలోచనతో బృహత్తర పథకానికి సీఎం కేసీఆర్ నాంది పలికారన్నారు. మానవ మనుగడ ఉన్నన్ని రోజులు అన్ని వృత్తులు కూడా అవసరమేనని, అందుకే కల్యాణలక్ష్మి తరహాలో ఈ పథకం కూడా నిరంతరాయంగా అమలవుతుందని పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీలు రామేశ్వర్‌రెడ్డి, మహిపాల్, జడ్పీటీసీలు ఓస రాజేశ్వర్, జీవన్‌రెడ్డి, నాయకులు రాంకిషన్‌రెడ్డి, ధర్మాజి రాజేందర్, మారుగొండ రాము, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వీ లోకేశ్వర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.




నిర్మల్ కలెక్టరేట్‌లో రూ.లక్ష సాయం చెక్కు అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

## సొంతంగా దుకాణం పెట్టుకుంట..



నిర్మల్ పట్టణంలోని గాంధీచౌక్‌లో ఇన్ని రోజులు మా అన్న దుకాణంల పనిజేసిన. నాకు అన్ని రకాల నగలు తయారీ వచ్చు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష రూపాయలతో సొంతంగా బంగారు దుకాణం పెట్టుకుంట. నేను 10వ తరగతి చదువుతున్న. ఇద్దరు పిల్లలున్నరు. ఇలా ఒకరి దగ్గర ఎన్ని రోజులు పని చేసుకోవాలే. రేపు పిల్లల భవిష్యత్ ఎట్లా..? అన్న దిగులుండేది. కేసీఆర్ ప్రభుత్వం చేసిన సాయంతో జీవితానికి భరోసా దొరికింది. ఆయనను జీవితంల మర్చిపోను. జిల్లాలో మొట్టమొదటి చెక్కు నాకే ఇచ్చిన్రు. ఇది గొప్ప అదృష్టంగా భావిస్తున్న.

*- నాంపెల్లి రాఘవేంద్ర, విశ్వబ్రాహ్మణుడు, ఎల్లపెల్లి*



హాజరైన లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు

## కటింగ్ షాపు పెట్టుకుంట...



మా నాన్న సాయన్న, నేను ఇద్దరం కలిసి కులవృత్తి చేసుకుంటూ బతుకుతున్నం. ఇన్ని రోజులు ఊరిలోని చెట్టు కింద కూర్చొని గ్రామస్తులకు గడ్డం, వెంట్రుకలు తీసేది. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన లక్ష రూపాయలతో రోడ్డు పక్కన టేలా వేసుకొని కుర్చీలు, ఇతర వస్తువులను తెచ్చుకుంటం. ఇన్ని రోజులుగా రోడ్డుమీద ఉన్న మా బతుకులకు సీఎం కేసీఆర్ సారు కొండంత భరోసా ఇచ్చిండు. రెండేళ్ల కింద మా చెల్లెలు స్రవంతి పెండ్లికి కల్యాణలక్ష్మి కింద లక్ష వచ్చినయ్. మా ఒక్క కుటుంబానికే ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు లక్షలు సాయం చేసింది.

*- ఉల్లెంగల నరేందర్, నాయీ బ్రాహ్మణుడు, లోకల్ వెల్మల్*

## ఇంతకుముందు ఎవరూ పట్టించుకోలేదు..



ఇంతకుముందు మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. కేసీఆర్ సారు వచ్చినంకనే మా అసొంటోళ్లకు అంతా మంచి చేస్తున్నడు. నేను రోజు పది మంది ఇండ్లల్ల బట్టలు ఉతకడానికి పోత. వాళ్లిచ్చే పైసలతో కుటుంబాన్ని పోషించుకుంటున్న. ఇద్దరు ఆడ పిల్లలు. ఆదిలాబాద్‌లోని గురుకుల స్కూళ్ల సదువుతున్నరు. నా భర్త చిన్నరాజన్న కూడా ఇదే పని చేస్తడు. మా ఇద్దరికీ ఇస్త్రీ పని వస్తది. ప్రభుత్వం ఇచ్చిన లక్షతో ఇస్త్రీ దుకాణం పెట్టుకుంటం. పొద్దున బట్టలు ఉత్కపోతం. సాయంత్రం ఇస్త్రీ జేస్తం. ఇంత పెద్ద సాయం జేసిన కేసీఆర్ సారును ఎన్నటికీ మరువం.

*- గడ్‌చంద లక్ష్మి, రజక వృత్తిదారు, వెంగ్వాపేట*